
సాక్షి
పల్నాడు
శుక్రవారం | 19 | జూలై | 2024



మల్లేశ్వరుని కానుకల లెక్కింపు

పెదకాకాని: మల్లేశ్వరునికి కానుకల ద్వారా రూ.57,58,351 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామవరప్రసాద రావు చెప్పారు. గురువారం లెక్కింపు చేపట్టారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1611 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 505.10 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,700, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నారా హంతక ముఠా నరమేధం

రక్తమోడుతున్న పల్నాడు

పగలు, ప్రతీకారాలను వదిలి ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి పథాన పయనిస్తున్న పల్నాడులో 'నారా' హంతక ముఠా మళ్లీ ఫ్యాక్షన్ చిచ్చును రాజేసింది. ఎన్నికల్లో గెలుపు కోసం కరడుగట్టిన నేరస్తులను ఎగదోసి హింసాకాండను సాగించింది. ఎన్నికల రోజు, ఆ తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేణులే లక్ష్యంగా దాడులు, విధ్వంసాలకు తెగబడింది. కుయుక్తులతో కూటమిగట్టి గెలిచిన తర్వాత కాల'కూటమై' కోరలు చాస్తోంది. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. నరమేధాన్ని సృష్టించి బలి కోరుతోంది. రక్తతర్పణాలతో పల్లెసీమలను తడుపుతోంది. రాక్షసానందంతో వికటాట్టహాసం చేస్తోంది.



వినుకొండలో నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే రషీద్‌ను కత్తితో నరుకుతున్న జిలాని

- దాడులు, హత్యాయత్నాలతో అట్టుడుకుతున్న జిల్లా
- నీచ రాజకీయాలకు ఫ్యాక్షన్‌ను ఎగదోసిన చంద్రబాబు
- గెలుపు కోసం కరడుగట్టిన హంతకులకు బాధ్యతలు
- ఎల్లో కూటమి విజయం తర్వాత రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా దాడులు, హత్యలు
- తాజాగా పాశవిక హత్యతో రాక్షసత్వాన్ని చాటుకున్న పచ్చదండు



కారెంపూడిలో ఎన్నికల తర్వాత వైఎస్సార్ సీపీ నేత ఆటో కన్సల్టెన్సీలోని వాహనాలకు నిప్పు పెట్టిన దృశ్యం




బ్రాహ్మణపల్లిలో గాయపడిన సొసైటీ చైర్మన్ పిచ్చిరెడ్డి, పాటూరి శ్రీనివాసరావు



తుమ్మలచెరువులో క్షతగాత్రుడు



పెద అగ్రహారంలో గాయపడిన కృష్ణ



ముప్పాళ్ల మండలం తొండపిలో వాహనం ధ్వంసం

సాక్షి ప్రతినిధి, గుంటూరు, సాక్షి, నరసరావుపేట: ఒకప్పుడు ఫ్యాక్షన్‌తో రగిలిన పల్నాడు గత ఐదేళ్లలో కక్షలకు దూరంగా జరిగింది. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి బాటలెక్కింది. దీనిని చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పరిస్థితి ఇలాగే కొనసాగితే తన పార్టీకి మనుగడ ఉండదన్న భావనతో ఫ్యాక్షన్‌కు మళ్లీ ప్రాణం పోశారు. రాజకీయాలకు దూరంగా ఉంటున్న కరడుగట్టిన ఫ్యాక్షనిస్టు జూలకంటి బ్రహ్మారెడ్డిని మాచర్ల ఇన్‌చార్జిగా నియమించారు. పల్నాడులో అలజడి సృష్టించేందుకు యత్నించారు. ఎన్నికల సమయంలో గెలుపే లక్ష్యంగా పచ్చమూకలను ఉసిగొలిపి దాడులు, విధ్వంసాలకు ఒడిగట్టారు. జిల్లాలోని 53 గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారు. ఇళ్లపై పడి ఆస్తులు ధ్వంసం చేశారు. చాలా మందిని ఊళ్ల నుంచి తరిమేశారు.

ఎన్నికల ముందు నుంచే దాడులు

ఎన్నికల సమయంలో మాచర్లలో జెండా పాతడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ సాగించిన విధ్వంస కాండకు పోలీసు ఉన్నతాధికారులు, సర్కిల్ అధికారులు అండగా నిలిచారు. జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నా డీఐజీ గానీ, ఎస్పీ గానీ, కలెక్టర్ గానీ స్పందించ లేదు. మాచర్లలో జూలకంటి బ్రహ్మారెడ్డిని ఎప్పుడైతే అభ్యర్థిగా ప్రకటించారో అప్పటి నుంచి అరాచకాలు మొదలయ్యాయి. పల్నాడును కైవసం చేసుకోవాలంటే జిల్లాలో అప్పుడు ఉన్న ఐజీ, ఎస్పీ ఇతర అధికారులు ఉంటే తమ పన్నాగాలు పారవని టీడీపీ నేతలు గుర్తించారు. అప్పటి ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నారు. ఆయన ఉంటే బూత్ క్యాప్చర్, ఓటర్లను భయపెట్టడం కుదరదని అభిప్రాయపడ్డారు. అప్పుడే పొత్తు పెట్టుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ద్వారా పావులు కదిపారు. తమకు అనుకూలంగా ఉండే అధికారులకు పోస్టింగ్ ఇప్పించుకున్నారు.

పోలింగ్ రోజు విధ్వంసకాండ



ఎన్నికల రోజున నరసరావుపేట వైఎస్సార్ సీపీ అభ్యర్థి, అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపైకి రెండు వందల మంది తెలుగుదేశం పార్టీ మూకలు మారణాయుధాలు చేతబట్టి దాడికి తెగబడ్డాయి. ఆ సమయంలో శ్రీనివాసరెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన మామ కంజుల రామకోటి రెడ్డిపై టీడీపీ కిరాయి గూండాలు దాడి చేశారు.



గాయపడిన గోపిరెడ్డి మామ రామకోటిరెడ్డి

"ఎన్నికల ముందే కారెంపూడి మండలం వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డిపై దాడి చేసి టీడీపీ నేతలు బెదిరించారు. మే 12న రెంటచింతలలో పోలీసులు ఉండగానే మోర్తాల ఉమా మహేశ్వరరెడ్డిపై దాడి చేశారు. రెంటచింతల మండలం పాల్వాయి గేట్ వద్ద 201, 202 పోలింగ్ స్టేషన్లలోకి వైఎస్సార్ సీపీ ఏజెంట్లనూ తెలుగుదేశం నేతలు అనుమతించలేదు."

టీడీపీ వేధింపులకు బలి



చిలకలూరిపేటలో తెలుగుదేశం నాయకుల దాష్టీకానికి ఓ నిండు ప్రాణం బలైంది. గోపాళంవారిపాలెం గ్రామానికి చెందిన జడ ఆనంద్ (38) ఎన్నోఏళ్లుగా ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆనంద్‌ను ఉద్యోగానికి రాజీనామా చేయాలని ఒత్తిడి చేశారు. లేకుంటే క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయిస్తామని బెదిరించారు. తీవ్ర మనస్తాపానికి గురైన ఆనంద్ పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య రత్నకుమారితోపాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రెంటపాళ్లలో మరొకరు..



పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు (37) టీడీపీ నేతల ఒత్తిడితో, పోలీసుల వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నాగమల్లేశ్వరరావు ఇంటిపై, ఎస్సీ కాలనీపై దాడులకు దిగారు. ఈ నేపథ్యంలో గ్రామం విడిచి వెళ్లకపోతే రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపుతామని ఎస్‌హెచ్‌ఓ రాజేష్‌కుమార్ బెదిరించడంతో మనస్తాపం చెంది నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆర్‌ఎంపీపై హత్యాయత్నం



పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు పోట్లూరి శివయ్య వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పనిచేశాడనే కోపంతో ఆయన ఇంటిపై టీడీపీ నాయకులు మారణాయుధాలతో దాడి చేశారు. శివయ్య కుడి చేతికి కత్తిపోటుతో గాయమైంది. దీనిపై అప్పటి ఎస్పీ మలికా గార్గ్‌కు శివయ్య ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో రాజీ పడటం లేదని శివయ్యపై ప్రస్తుతం తప్పుడు కేసులు పెట్టేందుకు యత్నిస్తున్నారు.

రిగ్గింగ్‌కు తెగబడి..!

తుమ్మకోట గ్రామంలో తెలుగుదేశం పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడినప్పుడు ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈవీఎంలూ ధ్వంసమయ్యాయి. వెల్దుర్తిలోని 137, 138, 139, 140, 141 పోలింగ్ స్టేషన్లలో రాత్రి ఏడు గంటల తర్వాత వైఎస్సార్ సీపీ ఏజెంట్లను బయటకు పంపి రిగ్గింగ్ చేశారు. ఒప్పిచర్ల గ్రామంలో 250, 251, 252, 256 పోలింగ్ స్టేషన్లలో ఇతర సామాజిక వర్గాల వారు ఓటు వేసుకోలేని పరిస్థితిని సృష్టించారు.

పిన్నెల్లి సతీమణిపై దాడి

ఎన్నికలకు మూడు రోజుల ముందు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి సిరిగిరిపాడు గ్రామంలో ప్రచారం చేస్తుండగా ఆమెపై టీడీపీ నేతలు దాడి చేశారు. బందోబస్తుగా వచ్చిన ఎస్ఐ ఇతర పోలీసు సిబ్బందిపైనా దాడికి తెగబడ్డారు.

పాశవిక చర్యలకు పరాకాష్ట



రాష్ట్రంలో కూటమి పాలనలో పాశవిక చర్యలు పరాకాష్టకు చేరాయి. శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్నందునే అత్యంత దారుణాలు, దుర్మార్గాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. దాడులు మొదలైనప్పుడే పోలీసు ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకుని ఉన్నట్లయితే ఇంతటి ఉన్మాద చర్యలు చోటుచేసుకునేవి కావు. టీడీపీ ముఖ్య నాయకులు ప్రోత్సహిస్తున్నందునే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బరితెగిస్తున్నారు. ఇలాంటి హేయమైన చర్యలను ప్రతిఒక్కరూ తీవ్రంగా ఖండించాల్సిందే.

– మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ

పల్లెల్లో పచ్చ చిచ్చు

తొలుత ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో పచ్చమూకలు అలజడి సృష్టించాయి. దాడులను ప్రేరేపించాయి. మాచర్ల మండలంలోని కొత్తూరు, కంభంపాడు, భైరవునిపాడు, రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం, పాల్వాయిగేటు, గోలి, మిట్టగుడిపాడు, కారెంపూడి మండలంలోని ఒప్పిచర్ల, కారెంపూడి, పేటసన్నెగండ్ల, చింతపల్లి, దుర్గి మండలంలోని ముటుకూరు, అడిగొప్పల, పోలేపల్లి, వెల్దుర్తి మండలంలోని లోయపల్లి, వెల్దుర్తి, వజ్రాలపాడు, గొట్టిపాడు, నర్సపెంట గ్రామాల్లో టీడీపీ మూకలు దాడులకు తెగబడ్డాయి. గురజాల నియోజకవర్గంలో పిన్నెలి, కేసానుపల్లి, మాదినపాడు, ఇరిగేపల్లి, తంగెడ, కొత్తగణేశునిపాడు, మాచవరం, బ్రాహ్మణపల్లి, పెదఅగ్రహారం, జానపాడు, నరసరావుపేట నియోజకవర్గంలో నరసరావుపేట పట్టణం, దొండపాడు, పమిడిపాడు, సత్తెనపల్లి నియోజకవర్గంలో పాకాలపాడు, మాదల, తొండపి, చాగంటివారిపాలెం, నార్నెపాడు, గణపవరం, చీమలమర్రి, రూపెనగుండ్ల, గుండ్లపల్లి, కుంకలగుంట, చేజర్ల, వినుకొండ నియోజకవర్గంలో నూజెండ్ల, రెడ్డికొత్తూరు, బొల్లాపల్లి, కొచ్చర్ల, గంటావారిపాలెం, వినుకొండ పట్టణం, పెదకూరపాడు నియోజకవర్గంలో ఎర్రబాలెం, లగడపాడు, చంద్రాజుపాలెం, మాదిపాడు, చిలకలూరిపేట నియోజకవర్గంలోని అప్పాపురం గ్రామంలో పచ్చ ముఠాలు విధ్వంసం సృష్టించాయి.

ఎస్సీ మహిళలపై అరాచకం

రెంటచింతల మండలం తుమ్మకోటలో మే 13న ఓటు వేసేందుకు వెళ్తున్న ఎస్సీ, ఎస్టీ మహిళలపై టీడీపీలోని అగ్రకుల నాయకులు విచక్షణారహితంగా దాడి చేశారు. అప్పటికే క్యూలైన్లలో ఉన్న మహిళలను కొట్టి తరిమివేసి టీడీపీ నేతలు రిగ్గింగ్ చేశారు. పోలింగ్ బూత్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ ఏజెంట్లను లాగి బయటకు గెంటేశారు.

మరిన్ని దురాగతాలు

- వినుకొండ నియోజకవర్గం నూజెండ్లలో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. ఎన్నికలు పూర్తయిన మరుసటి రోజు పక్కా ప్రణాళిక ప్రకారం ప్రధాన సెంటరులో వైఎస్సార్ సీపీ నాయకులపై రాళ్ల కర్రలతో దాడులు చేశారు. దాడిలో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు.
- కారెంపూడిలో టీడీపీ గూండాలు 500 మంది బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ కరీంకు చెందిన వాచ్ షాపును ధ్వంసం చేశారు.
- కారెంపూడి ఎంపీపీ బొమ్మిన సావిత్రికి చెందిన పాలకేంద్రాన్ని ధ్వంసం చేసి తగలబెట్టారు. మాచర్ల రోడ్డులోని పోలిరెడ్డికి చెందిన టీ స్టాల్‌ను ధ్వంసం చేశారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ నివాసంపై దాడి చేశారు. ఎంపీటీసీ వేముల పద్మావతి భర్త నిర్వహిస్తున్న ఆటో కన్సల్టెన్సీపై దాడి చేసి 40 బైక్‌లకు నిప్పు పెట్టారు.
- ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్‌లోని అపార్ట్‌మెంట్‌లో నిలిపి ఉంచిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి కారును ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ నివాసానికి నిప్పు పెట్టారు.
- మాచవరం మండలం కొత్త గణేశునిపాడు, కేసానుపల్లిల్లో మహిళలను కొట్టారు.



వంతపాడిన పోలీసులు



దాడులు చేసిన తెలుగుదేశం పార్టీ వారిని వదిలిపెట్టి పోలీసులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపైనే కేసులు పెడుతూ వచ్చారు. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, అప్పటి నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై కేసులు నమోదు చేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ నేతలపై హత్యాయత్నం కేసులలో నిందితుడైన టీడీపీ నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద్‌బాబు, అతని అనుచరులను అరెస్ట్ చేయలేదు.

తాజాగా వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ను అతి దారుణంగా హత్య చేశారు. ఇప్పటికైనా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి పల్నాడులో శాంతిని నెలకొల్పాల్సిన అవసరం జిల్లా యంత్రాంగంపై ఉంది.

బేడ, బుడగ జంగాలపై దాడి

- మాచర్ల నియోజకవర్గం కారెంపూడి మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ శివారు బాలచంద్ర నగర్ (పోతురాజుగుట్ట)లో నివాసం ఉంటున్న బేడ, బుడగ జంగాలు తమకు ఓటు వేయలేదని ఆగ్రహించిన టీడీపీ గూండాలు సుమారు 70 మంది పోలింగ్ ముగిశాక వారి ఇళ్లపై పడి కనపడిన వారిని కనపడినట్లు కర్రలు, రాళ్లతో దాడి చేసి కొట్టారు. మహిళలు, పిల్లలని కూడా చూడకుండా చావబాదారు. ఇళ్లలోని సామగ్రిని నాశనం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెల్లూరి కోటయ్యకు చెందిన స్కార్పియో వాహనాన్ని ధ్వంసం చేశారు. గొర్ల సైదులు చేయి, కాలిపై కర్రలతో బాదారు. కత్తెర లక్ష్మి చేయి విరగ్గొట్టారు. రాళ్ల దాడితో అందరూ ప్రాణభయంతో ఇంటి నుంచి పారిపోయారు.
- మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండల పరిధిలోని గోలి గ్రామంలో వైఎస్సార్ సీపీకి చెందిన మూఢావత్ మల్లయ్యనాయక్, మూఢావత్ కొండానాయక్, ఆర్. నాగేశ్వరరావు నాయక్, మూఢావత్ నాగేశ్వరరావు నాయక్‌లపై టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచారు.

కొత్త గణేశునిపాడులో అరాచకం



గాయపడిన చౌదరి సింగరయ్య

ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయలేదన్న అక్కసుతో ఆ పార్టీ నేతలు మాచవరం మండలం కొత్త గణేశునిపాడులో అరాచకం సృష్టించారు. దాడుల్లో వైఎస్సార్ సీపీ నేతలు చౌదరి సింగరయ్య, దారం లక్ష్మిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. టీడీపీ నేతలకు భయపడి ఎస్సీ, బీసీ నేతలు ఊరు వదిలారు. మహిళలు, చిన్న పిల్లలు గంగమ్మ గుడిలో తలదాచుకున్నారు. ఇది తెలిసి పచ్చమూకలు గుడిపైకీ రాళ్లు రువ్వారు. బాధితులను పరామర్శించడానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అనిల్ కుమార్, కాసు మహేష్‌రెడ్డిపైనా దాడులు చేశారు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి నాయకులను గ్రామాలు దాటించాల్సిన పరిస్థితి నెలకొంది. టీడీపీ నేతలకు భయపడి పిన్నెల్లి గ్రామం నుంచి సుమారు 1,050 మంది పక్కనే ఉన్న తెలంగాణకు పరారై తలదాచుకుంటున్నారు. పిన్నెల్లిలో ఇప్పటికీ దాడులు జరుగుతూనే ఉన్నాయి. సాగు చేపట్టకపోవడంతో వందల ఎకరాలు బీడుగా మారాయి.



గాయపడిన దారం లక్ష్మిరెడ్డి

తొండపిలో మైనార్టీలపై పైశాచికం



సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం తొండపి గ్రామంలోని వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన ముస్లిం వర్గీయుల ఇళ్లల్లోకి టీడీపీ మూకలు చొరబడ్డాయి. మహిళలను, చిన్నారులని చూడకుండా దాడులకు తెగబడ్డాయి. ఈ తరుణంలో ముస్లిం కుటుంబాల్లోని మగవారంతా ప్రాణాలు కాపాడుకునేందుకు పొలాల్లోకి పరుగులు తీశారు. మహిళలు, చిన్నారులు తలుపులు వేసుకొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ లోపలే ఉండిపోయారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులు గ్రామం వదిలి వెళ్లిపోయారు.

- పెదకూరపాడు నియోజకవర్గం కంభంపాడులో వైఎస్సార్ సీపీకి పట్టున్న ఎస్సీ, బీసీ కాలనీలపై టీడీపీ నేతలు పోలింగ్ రోజు దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద కూడా వీరంగం వేశారు. మహిళలు అని కూడా చూడకుండా దాడులకు పాల్పడ్డారు.

త్రికోటేశ్వరుడి తొలి ఏకాదశి ఆదాయం రూ.20.96 లక్షలు

నరసరావుపేట రూరల్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వారి ఆలయానికి రూ.20,96,556 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. పూజా టికెట్ల ద్వారా రూ.6,51,998, హుండీల ద్వారా రూ.10,47,073, ప్రసాదాల విక్రయాలతో రూ.3,56,595, అన్నదాన విరాళం ద్వారా రూ.40,890 వచ్చినట్టు పేర్కొన్నారు. గత సంవత్సరం కన్నా ఈ ఏడాది అదనంగా రూ.3,24,443 లభించినట్టు వివరించారు.

పేటసన్నెగండ్లలో ట్రాక్టర్ దహనం


కాలిపోయిన ట్రాక్టర్

కారెంపూడి: పల్నాడు జిల్లా పేటసన్నెగండ్ల గ్రామంలో రైతు నేలపాటి నరసింహారావుకు చెందిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి దహనం చేశారు. నరసింహారావుకు చెందిన కొట్టం దగ్గర ఉన్న ట్రాక్టర్‌కు దుండగులు నిప్పు పెట్టారని తెలుస్తోంది. అది గమనించి వెంటనే పరిసర ప్రజలు మంటలను ఆర్పారు. పక్కనే గడ్డివాముకు మంటలు వ్యాపించకుండా కాపాడారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కె.అమీర్ పేర్కొన్నారు. వ్యక్తిగత కక్ష కారణమా? ఇంకేదైనా కారణం ఉందా? అనేది దర్యాప్తులో తేలుతుందని తెలిపారు.

మహిళ కుటుంబంపై దౌర్జన్యం.. కేసు నమోదు

సత్తెనపల్లి: మహిళ కుటుంబంపై దౌర్జన్యం చేసిన ఘటనపై సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పాతకక్షల నేపథ్యంలో సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీకి చెందిన బలమాల జ్యోతి కుటుంబంపై భాగ్యనగర్ కాలనీకి చెందిన ఆరుగురు దౌర్జన్యం చేశారు. దీనిపై జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు పేరు తేవాలి

- ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వర రావు
- సత్తెనపల్లిలో సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాలికలు, బాలుర జట్లతో సుబ్రహ్మణ్యేశ్వర రావు, పీడీలు

సత్తెనపల్లి: క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. సుబ్రహ్మణ్యేశ్వర రావు సూచించారు. పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన సబ్ జూనియర్ బాల, బాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గెలుపే లక్ష్యంగా క్రీడల్లో రాణించాలన్నారు. బాలికల జట్టు ఈ నెల 23వ తేదీ నుంచి తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనబోతోందన్నారు. ఈ జట్టు ఎంపికలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి, సీనియర్ ఫుట్‌బాల్ ప్లేయర్ వి. విజయ కుమార్, సీనియర్ ఫుట్‌బాల్ ప్లేయర్, ఈసీ మెంబర్ చక్రవర్తి, పీడీలు ఎస్.కె. రియాజ్, ఏఎస్ నాగిరెడ్డి, ఎ. శ్రీరామ్ రెడ్డి, ఎస్.ఎం. సుభాని, సత్యవతి, అచ్చిరెడ్డి, నరసింహారావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల జట్టు...

సబ్ జూనియర్ బాలికల జట్టుకు పి.ఈశ్వరి, అలేఖ్య, గాయత్రి సౌజన్య, ఎం.హర్షిణి, ఎస్.జ్ఞానేశ్వరి, బి. శ్రీలక్ష్మి, అక్షర (సత్తెనపల్లి), బి.చంద్రిక, రవి తేజస్విని, ఎస్.మౌనిక, ఎస్.మంజుల (కొమెరపుడి), పి.విజయలక్ష్మి, త్రివేణి, కె.రోహిణి, ఇ.ప్రత్యూష (ఫణిదం), ఆర్. ప్రసన్న, కె.త్రివేణి, ఎస్. అమూల్య, పి.ప్రవల్లిక (మాదల), ఎస్.కె.సానియాబేగం, పి.కీర్తన (ముప్పాళ్ల), ఎస్. హేమలత (బట్లూరు), కె.రమ్యశ్రీ , ఎం.సౌజన్య (రుద్రవరం), జి.బాలాంజలి సరస్వతి (బలిజేపల్లి), పి.శ్వేత (భీమవరం) ఎంపికయ్యారు.

బాలుర జట్టు ఇదే...

సబ్ జూనియర్ బాలుర జట్టుకు షేక్ ఫారుక్ అహ్మద్, ఎస్.కె.రహమాన్, ఎన్.బి. మొహమ్మద్ రఫీ, కె.ఆకాష్, ఎస్.కె.మహబూబ్ సుభాని, ఎస్.కె.అబ్దుల్ రహమాన్, ఎస్.కె. మొహమ్మద్ యాసిన్, పి మనోజ్ కుమార్, దీక్షిత్ (సత్తెనపల్లి), కె.సాంబశివ రావు, షేక్ మస్తాన్ వలి, షేక్ మొహమ్మద్, సి.హెచ్.హర్షిత్, కార్తికేయ, డి.మణికంఠ, బి.తంబి, వి.అంకమ్మరావు (మాదల), ప్రవీణ్ కుమార్, ఎంఎస్‌కే దరియా హుస్సేన్ (ముప్పాళ్ల), ఎస్.రామ్ చరణ్, కె.యశ్వంత్, బి.వంశీ (కొమెరపూడి), ఎస్‌కే మొహమ్మద్ సల్మాన్ (ఫణిదం), ఎన్ పునీత్, కె. ప్రేమ్‌కుమార్ (అబ్బూరు) , జి.మణికంఠ, ఈ.రోహిత్ శ్రీనాథ్ (పిడుగురాళ్ళ), ఎస్.కె. సమీర్, శాలెం రాజు (ముప్పాళ్ల), కె.కార్తీక్, ప్రణీత్ (ధూళిపాళ్ల), కె.కిరణ్, జి.నాగేంద్ర బాబు (కొమెరపూడి) ఎంపికయ్యారు.

రషీద్ కుటుంబానికి నేడు వైఎస్ జగన్ పరామర్శ

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: టీడీపీ నేతల చేతిలో బుధవారం రాత్రి అత్యంత పాశవికంగా హత్యకు గురైన వైఎస్సార్ సీపీ వినుకొండ యువజన నాయకుడు షేక్ రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వినుకొండకు రానున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైఎస్ జగన్ పర్యటనలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని టీడీపీ అకృత్యాలపై గళమెత్తాలని సూచించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నరసరావుపేట మీదుగా వినుకొండకు వైఎస్ జగన్ చేరుకుంటారని పేర్కొన్నారు. మృతుడు రషీద్ కుటుంబానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా పంచాయతీ అధికారి ఎం.విజయభాస్కర రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో విజయభాస్కర రెడ్డి

నరసరావుపేట రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.విజయభాస్కర రెడ్డి తెలిపారు. సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఇందులో విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగుతోపాటు కలుషిత నీరు సరఫరా కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు అందించాలని తెలిపారు. క్లాప్ మిత్రాలు అందించిన తడిచెత్త, పొడిచెత్తను ఎస్‌డబ్ల్యూపీఎస్ షెడ్‌ల దగ్గరకు చేర్చాలని పేర్కొన్నారు. పీఆర్‌వస్ యాప్‌లో ప్రజారోగ్య సామాన్ల స్టాక్‌ను నమోదు చేయాలని చెప్పారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలను ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో కలిసి నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికాంత్, ఈవోపీఆర్‌డీ కేవీ శివప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భాషా, ఎంపీహెచ్ఎస్ సూర్యకుమార్ డీఆర్‌పీలు నాయక్, అహ్మద్‌దాబి, విజయ సుందరదాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యశ్రీ


హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీలో ఎన్. సత్యశ్రీ, ఇతర న్యాయమూర్తులు, సిబ్బంది

నరసరావుపేట టౌన్: ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ కోరారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ వినియోగంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. హెల్మెట్ ధరించటం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు రక్షణ పొందవచ్చని చెప్పారు. ప్రమాదాల్లో అధిక శాతం హెల్మెట్ ధరించక పోవటం వల్లే ప్రాణాలు కోల్పోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు ప్రమాదాల చట్టాలపై ఇటీవల మార్పులు తీసుకొచ్చాయని గుర్తుచేశారు. వాటిని అనుసరించి ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు విధిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్ వినియోగంపై ప్రజలను చైతన్య పరిచేందుకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదట అదనపు జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి 'హెల్మెట్ ధరిద్దాం.. ప్రాణాలు నిలబెట్టుకుందాం..' అనే నినాదంతో మొదలైన ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగింది. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఏ పూర్ణిమ, కె. మధుస్వామి, ఆర్. ఆశీర్వాదం పాల్, టి. ప్రవల్లిక, ఎంవీఐ శ్రావ్య, న్యాయవాద సంఘం అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరావు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు అవగాహన అవసరం


వినియోగదారుల నుంచి అర్జీలు తీసుకుంటున్న ఎన్. విక్టర్ ఇమాన్యుయేల్

చిలకలూరిపేట: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులకు సమస్యలపై అవగాహన కల్పిస్తూ అధికారులు సేవలు అందించాలని ఏపీసీపీడీసీఎల్ జీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి ఎన్. విక్టర్ ఇమాన్యుయేల్ సూచించారు. పట్టణంలో విద్యుత్ ఈఈ కార్యాలయ ప్రాంగణంలో వినియోగదారుల అదాలత్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు విద్యుత్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ అవగాహన లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. అధికారుల సేవలను ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తక్షణమే అర్జీదారుల ఇబ్బందులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ ఈఈ సీహెచ్ రమేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సాంకేతిక సభ్యుడు కె . వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర్య సభ్యులు ఎ.సునీత, సీఆర్‌డీఏ సర్కిల్ ఎస్ఈ పి. విజయకుమార్, డీఈఈలు ఆర్. అశోక్‌కుమార్, గురునాథం, ఏఈఈలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలకు విద్యార్థి ఎంపిక


కార్తీక్

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర స్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీలకు కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి డీవీఎస్ కార్తీక్ ఎంపికైనట్టు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు పి.కరీముల్లా గురువారం తెలిపారు. ఈ నెల 13, 14వ తేదీలలో తాడేపల్లిలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలుర సింగిల్స్ విభాగంలో కార్తీక్ ప్రథమ స్థానం సాధించినట్టు పేర్కొన్నారు. త్వరలో శ్రీకాకుళంలో జరుగనున్న అంతర జిల్లాల బాడ్మింటన్ పోటీలలో కార్తీక్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు వివరించారు.

52 పరుగులకే కుప్పకూలిన కడప


5 వికెట్లు తీసిన విశాఖ బౌలర్ గౌతమ్

నరసరావుపేట ఈస్ట్: పేలవమైన బ్యాటింగ్‌తో కడప జట్టు 52 పరుగులకే కుప్పకూలగా.. విశాఖపట్నం తొలిరోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు నష్టపోయి 148 పరుగులు సాధించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్‌కేబీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 అంతర జిల్లాల బాలుర క్రికెట్ పోటీలలో భాగంగా గురువారం కడప, విశాఖపట్నం జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కడప జట్టు 42.1 ఓవర్లలో 52 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని ఫర్హాజ్‌ఖాన్ 14 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. విశాఖపట్నం బౌలర్ కె.గౌతమ్ ఆర్యా 12.1 ఓవర్లలో 7 పరుగులిచ్చి ఐదు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు నష్టపోయి 148 పరుగులు చేసింది. జట్టులోని వీసీహెచ్ శ్రావణ్ 51 పరుగులు సాధించాడు. శుక్రవారం రెండో రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కేవీ పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్. సీతాపతిరావులు పరిశీలించారు.

ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు


నర్సింగపాడులోని దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నకరికల్లు: అనుమతులు, సరైన బిల్లులు లేకుండా అమ్మకాలు, కొనుగోళ్లు జరిపితే కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్.శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మండలంలోని నర్సింగపాడు, చల్లగుండ్ల, నకరికల్లు గ్రామాల్లో ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో గురువారం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాకు నిల్వలు, బిల్లుల పుస్తకాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువుల లైసెన్స్, ఫామ్-ఓ జతచేయని వాటి అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. నర్సింగపాడు గ్రామంలోని కాశీవిశ్వేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో ఫాం-ఓ లేనందువల్ల రూ 1.17 లక్షల విలువైన 19.8 టన్నుల యూరియా అమ్మకాలు నిలిపివేశామన్నారు. చల్లగుండ్లలోని శ్రీశ్రీనివాస ట్రేడర్స్ ఎరువులు, పురుగుమందుల దుకాణంలో ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేనందున రూ. 34 వేల విలువైన 31.5 లీటర్ల పురుగుమందుల అమ్మకాలు ఆపేసినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ కె.రమణ, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ బడిలోనే మధ్యాహ్న భోజనం తినాలి

- నాణ్యతకు పెద్దపీట వేయాలి
- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం


ముప్పాళ్ల జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ముప్పాళ్ళ: 'అన్నం ఎలా ఉంటోంది? రుచిగా వండుతున్నారా? కోడిగుడ్డు ఇస్తున్నారా? అంటూ పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. ఆహారాన్ని రుచి చూసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొందరు విద్యార్థులు క్యారేజ్ తెచ్చుకోవడం చూసి ఎందుకు తెచ్చుకుంటున్నారని అడిగారు. ప్రతి విద్యార్థీ పాఠశాలలోనే భోజనం తినేలా చూడాలని హెచ్ఎం కుంభా నాగేంద్రమ్మను ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. సేవలు, సర్వీసు సర్టిఫికెట్ల ప్రక్రియను, పెండింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్‌లో ఆదివారం విధులకు గైర్హాజరవడాన్ని గుర్తించి, ఎందుకు రావటం లేదని ప్రశ్నించారు. ఆదివారం కూడా ఆస్పత్రి పనిచేయాలని ఆదేశించారు. అందుబాటులో ఉండాలని పీహెచ్‌సీ వైద్యుడికి చెప్పారు. ఈ-ఔషధ్ వివరాలను సాయంత్రానికి ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. కాన్పు గదిలో ఉన్న బాలింతతో మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న మీటింగ్ హాలు గురించి ఆరా తీశారు. కలెక్టర్‌తోపాటుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి, తహసీల్దార్ పి.సింగారావు, ఇన్‌చార్జి ఎంఈఓ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి ఉన్నారు.

రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీకి 23న జట్ల ఎంపిక

క్రోసూరు: ఆగస్టు 10,11,12వ తేదీల్లో వినుకొండలోని గుడ్‌షెపర్డ్స్ స్కూల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కి యువతీయువకుల జట్ల ఎంపిక ఈనెల 23న నిర్వహించనున్నట్టు గుంటూరు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.కిషోర్‌రెడ్డి, కార్యదర్శి శివపార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లిషు మీడియం పాఠశాల ఆట స్థలంలో ఎంపిక జరుగుతుందని చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, సాఫ్ట్‌బాల్ రిజిస్ట్రేషన్ ఫాం వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. వివరాలకు పాఠశాల పీఈటీ ఎం.వెంకట్రావును 99084 33422, విజయ్‌కుమార్‌ను 94901 87858 ఫోను నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఎంపికైన యువతులకు ఆగస్టు ఒకటో తేదీ నుంచి సెయింట్ ఆన్స్ పాఠశాలలో శిక్షణ ఇస్తామని హెచ్ఎం మేరీ రజిత తెలిపారు.

గోవా మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ఈపూరు: గోవా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ఈపూరు సెబ్ అధికారులు పట్టుకున్నారు. ఈపూరు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా గోవా నుంచి 400 మద్యం బాటిళ్లు తీసుకొస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వినుకొండ సెబ్ సీఐ జిలానీ, ఎస్సై రేవతిలు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

జిల్లాలో 83.8 మి.మీ. వర్షపాతం నమోదు

నరసరావుపేట: జిల్లాలోని 28 మండలాల పరిధిలో గడిచిన 24 గంటల వ్యవధిలో 83.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లా వాతావరణ అధికారులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు అచ్చంపేట మండలంలో 27.6 మి.మీ., క్రోసూరులో 9.6, అమరావతిలో 36.4, పెదకూరపాడులో 9.2, సత్తెనపల్లిలో 1 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో జులై మాసం సాధారణ వర్షపాతం 2129.1 మి.మీ. కాగా.. ఇప్పటివరకు 1657.4 మి.మీ. కురిసినట్లు అధికారులు వెల్లడించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 505.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,700, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 806.60 అడుగుల వద్ద ఉంది. జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి 25,539 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.మల్లేశ్వరి

క్రోసూరు: స్కీం వర్కర్లైన అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికులు, వీవోఏ తదితరులపై రాజకీయ వేధింపులను వెంటనే ఆపాలని అంగన్‌వాడీ వర్కర్స్ , హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి జి. మల్లేశ్వరి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో క్రోసూరు ప్రాజెక్టు కమిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజానీకానికి వివిధ సేవలు అందిస్తున్న స్కీము వర్కర్లపై వేధింపులను వెంటనే ఆపాలని కోరారు. ఎన్నికలు జరిగి ప్రభుత్వాలు మారిన ప్రతి సందర్భంలో స్కీం వర్కర్లపై వేధింపులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వారి సమస్యలను పరిష్కారిస్తామని హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వేధింపులకు గురి చేయటం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారిందని విమర్శించారు. ఈ ఒత్తిడిని తట్టుకోలేక కొంతమంది అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ఒత్తిళ్లను ఆపకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా నాయకులు జి.రవిబాబు మాట్లాడుతూ.. అధికారంలో ఎవరు ఉన్నప్పటికీ అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో సుమారు 30 మంది అంగన్‌వాడీ వర్కర్లను ఉద్యోగాలను తీసివేస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వర్కర్లపై వేధింపులు ఆపకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను నివారిద్దాం

- మూడు నెలల్లో ముగ్గురు శిశువులు, నలుగురు తల్లులు మృతి
- పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు
- డీఎంహెచ్ఓ డాక్టర్ రవి


పల్నాడు రోడ్డులోని తన కార్యాలయంలో సమీక్ష చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రవి

నరసరావుపేట: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో గత మూడు నెలల కాలంలో నాలుగు మాతృ, మూడు శిశు మరణాలు సంభవించాయి. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి హెచ్చరించారు. గురువారం పల్నాడు రోడ్డులోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో మాతా, శిశు మరణాలపై వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఆశాలతో సమీక్ష చేశారు. అచ్చంపేట, క్రోసూరు, బొల్లాపల్లి, కొప్పునూరు ఆరోగ్య కేంద్రాల పరిధిలో నాలుగు మాతృ మరణాలకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. క్రోసూరు, కోటప్పకొండ, ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సంభవించిన మూడు శిశు మరణాలపై విచారణ నిర్వహించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. సమీక్షలో జిల్లా ప్రభుత్వ హాస్పిటళ్ల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్, గైనకాలజిస్ట్ డాక్టర్ మంత్రునాయక్, అనస్తీషియా డాక్టర్ వెంకటరావు, గైనకాలజిస్టు డాక్టర్ వసంత్రాయ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమకుమార్, గుంటూరు జీజీహెచ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బుచ్చిబాబు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, డీఎల్‌వో డాక్టర్ మురళీకృష్ణ, కె.సాంబశివరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.